క్లుప్తంగా

సాయిబాబా ఆలయ పుష్కర మహోత్సవం

కొత్తగూడెంటౌన్: ఈ నెల 12, 13, 14 తేదీల్లో పట్టణంలోని ప్యూన్ బస్తీలో నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ షిర్డీ సాయిబాబా ఆలయం పుష్కర (12)వ వార్షికోత్సవ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో భక్తులను కోరారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న కార్యక్రమాల్లో భాగంగా 12వ తేదీ ఉదయం సభా ప్రార్థన, దిక్షాధారణ, దీపారాధనలు, 13న భజన, 14న ప్రత్యేక ప్రార్థనలు, అన్నదాన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీఓ కృష్ణ

జూలూరుపాడు: ఇటీవల ఎంపీఓగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన పి.కృష్ణ గురువారం జూలూరుపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైరా ఎమ్మెల్యే రాములు నాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంపీపీ లావుడ్యా సోనీ, తదితరులు ఉన్నారు.

బ్రిడ్జ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి



సంతకాల సేకరణలో సీపీఐ, మహిళా సంఘం నేతలు

ఇల్లెందు: ఒలింపిక్ కామన్‌వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించి ప్రపంచ గుర్తింపు సాధించి దేశానికి కీర్తి పతాకాలు తెచ్చిన మల్లయోధులపై బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడం అవమానకరమని, తక్షణమే అతన్ని అరెస్టు చేయాలని సీపీఐ, మహిళా సంఘం డిమాండ్ చేసింది. గురువారం పట్టణంలోని 24 ఏరియా, నంబర్-2 బస్తీ, జేకే కాలనీలో అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్ర, కనకతార, బందం నాగయ్య మాట్లాడుతూ.. దేశంలో ఇలాంటి ఎంపీలు ఉండటం బీజేపీకి గర్వకారణం, దేశానికి అవమానం అన్నారు. కార్యక్రమంలో ఉడుత ఐలయ్య, సారయ్య, మౌలానా, సుధీర్, శ్రీలక్ష్మి, చంద్రకళ, కనకతార, ఎర్రమ్మ, జమున, ఎల్లమ్మ, శేషమ్మ పాల్గొన్నారు.

పాఠశాలకు సొబగులు



లక్ష్మీదేవిపల్లి ప్రాథమిక పాఠశాల

సుజాతనగర్: మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని లక్ష్మీదేవిపల్లి ప్రాథమిక పాఠశాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. అంతకుముందు అధ్వానంగా ఉన్న పాఠశాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. పెయింటింగ్, ప్రహరీ, వరండా గదుల్లో నాపరాళ్లను ఏర్పాటు చేశారు. టాయిలెట్లు, కిచెన్‌షెడ్‌కు మరమ్మతులు చేపట్టారు. పాఠశాలకు బయట కార్పొరేట్ తరహాలో నేమ్ బోర్డు అమర్చారు. పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోళ్లకు ఎదురుచూపు

- మొక్కజొన్న కొనుగోళ్లు లేక రైతుల అవస్థలు
- వారం రోజులుగా కల్లాల్లోనే పడిగాపులు
- వాతావరణంలో మార్పులతో ఆందోళన



కొనుగోలు కేంద్రం వద్ద అధికారుల కోసం రైతుల ఎదురుచూపు

ఇల్లెందురూరల్: దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా ఉంది మండలంలోని మొక్కజొన్న రైతుల దుస్థితి. చల్లసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినా నేటికీ కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో పంట ఉత్పత్తులపై పట్టాలు కప్పి దేవుడిపై భారం వేసి కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నారు.

అసలే ఆలస్యమైందంటే..

జిల్లాలో ఇల్లెందు మండలంలోనే యాసంగిలో మొక్కజొన్న అత్యధిక విస్తీర్ణంలో సాగైంది. గడిచిన రెండు నెలలుగా మొక్కజొన్న కంకులు విరిచి మర పట్టించి గింజలు ఆరబోసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు జాప్యం జరగడంతో ఇప్పటికే యాభైశాతానికి మించి రైతులు తమ పంటను దళారులకు విక్రయించుకున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.1,945 ఉండగా దళారులు ప్రారంభంలో రూ.2వేలకు కొనుగోలు చేసి ఆ తరువాత క్రమంగా ధర తగ్గిస్తూ రైతుల శ్రమను దోచుకోవడం ప్రారంభించారు. ధర అమాంతం రూ.1600కు పడిపోవడంతో ఆందోళనకు గురైన రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన ప్రభుత్వం గత నెల చివరి వారంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మార్క్‌ఫెడ్‌ను ఆదేశించింది. దీంతో ఈ నెల 4వ తేదీన మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీ కేంద్రంలో ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించింది.

నేటికీ ప్రారంభం కాని కొనుగోళ్లు..

బహిరంగ మార్కెట్‌లో దళారులు మరీ తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న సమయంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో రైతులు సంతోషించారు. పంట ఉత్పత్తులను చల్లసముద్రం కొనుగోలు కేంద్రానికి తరలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం వచ్చేలా ఆరబెట్టి కేంద్రానికి చేర్చారు. కానీ ఒకటి.. రెండు.. మూడు.. ఇలా వారం రోజులుగా ఎదురుచూసినా కొనుగోలు కేంద్రంలో మొక్కజొన్న కొనుగోళ్ల జాడ లేదు. కనీసం అటుగా చూసే అధికారులే కరవయ్యారు. మొక్కజొన్నతోపాటు ధాన్యం కొనుగోళ్లదీ ఇదే పరిస్థితి.

వాతావరణంలో మార్పులతో ఆందోళన..

వారం రోజులుగా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన మొక్కజొన్నలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించారు. కానీ కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో పగలంతా కాపలా ఉండలేక.. రాత్రివేళ పట్టాలు కప్పి భద్రం చేసినా వర్షం వస్తే తడిసి మొలకలొస్తాయన్న ఆందోళనతో కంటినిండా నిద్ర ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారలు ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు కొనుగోలు చేస్తారోనని రైతులు ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది.

వారం నుంచి కాపలా ఉంటున్నా..



ఏడు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాం. దళారులు కొనుగోలు చేస్తామని ముందు కొచ్చినా తక్కువ ధరకు అడగడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తరలించాం. ఇక్కడ కొనుగోళ్లు లేవు. అడుగుదామన్నా ఒక్క అధికారి కూడా కనిపించడం లేదు. – నూనావత్ రాందాస్, రైతు, దనియాలపాడు

మబ్బులతో భయమేస్తోంది



నాకు ఉన్న కొద్దిపాటి చేనులో మొక్కజొన్న సాగుచేశాను. ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాను. వారం రోజులు గడిచింది. కొనేందుకు ఎవరూ రావడం లేదు. వాతావరణం చూస్తే మబ్బులతో ఎప్పుడు వర్షం కురుస్తుందోనని భయంగా ఉంది.
– తేజావత్ శ్రీను, రైతు, ధనియాలపాడు

రెండు రోజుల్లో ప్రారంభిస్తాం

ఐదు రోజుల క్రితమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాం. సంబంధిత సామగ్రి పూర్తిస్థాయిలో మావద్దకు చేరకపోవడం వల్లే జాప్యం జరుగుతోంది. టోకెన్ల పంపిణీ ప్రారంభిస్తున్నాం. రెండు రోజుల్లో కొనుగోళ్లు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదు
– హరిప్రసాద్, సీఈఓ, పీఏసీఎస్, ఇల్లెందు

‘రేగా’కు రాజకీయ భిక్ష పెట్టింది కాంగ్రెస్సే



మాట్లాడుతున్న చీమల వెంకటేశ్వర్లు

టేకులపల్లి: తనకు రాజకీయ భిక్ష పెట్టి ఎమ్మెల్యేగా గెలిపించిన తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని వదిలి బీఆర్‌ఎస్‌లో చేరిన పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, పార్టీనే ప్రాణంగా, కార్యకర్తలకు అండగా నిలుస్తున్న భద్రాచలం ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు పొదెం వీరయ్యను విమర్శించే అర్హత లేదని కాంగ్రెస్ పార్టీ ఇల్లెందు నియోజకవర్గ నేత చీమల వెంకటేశ్వర్లు అన్నారు. ఈమేరకు గురువారం టేకులపల్లి మండల పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం పార్టీకి కట్టుబడిన వ్యక్తి వీరయ్య అని అలాంటి వ్యక్తిని ప్రభుత్వ వేదికలో అవమానించడమే కాకుండా అధికారిక కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలనడం రేగా అవివేకానికి నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో పినపాకతో పాటు జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేసి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. వీరయ్యపై రేగా చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టేకులపల్లి, ఇల్లెందు మండలాల అధ్యక్షులు భూక్య దేవానాయక్, పులిసైదులు, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ రాసమల్ల నర్సయ్య, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రకళ, ఎట్టి సమ్మయ్య, జాఫర్, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: దొరకు ఊడిగం చేసే రేగా కాంతారావుకు కాంగ్రెస్ పార్టీని, ఎమ్మెల్యే పొదెం వీరయ్యను విమర్శించే స్థాయి లేదని టీపీసీసీ సభ్యుడు ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ జేబీ.శౌరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బడిపంతులుగా జీవితాన్ని గడిపే అతి సామాన్యుడిని ఎమ్మెల్యేగా చేసింది కాంగ్రెస్ పార్టీ అని, కన్నతల్లి లాంటి పార్టీకి ద్రోహం చేసిన రేగాకు భద్రాచలం ఎమ్మెల్యేను విమర్శించడం విడ్డూరం అని పేర్కొన్నారు.

లబ్ధిదారుడికి ట్రాక్టర్ అందజేత



నాగరాజుకు ట్రాక్టర్ అందజేస్తున్న ఎంపీపీ సోనీ

జూలూరుపాడు: దళితబంధు పథకం కింద మంజూరైన ట్రాక్టర్‌ను వినోభానగర్ గ్రామానికి చెందిన బోడా నాగరాజు అనే లబ్ధిదారుడికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ లావుడ్యా సోనీ అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ తాళ్లూరి రవి, వినోభానగర్ గ్రామ సర్పంచ్ భూక్యా పద్మ, బీఆర్‌ఎస్ నాయకులు భూక్యా లచ్చిరామ్, మిర్యాల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



ధాన్యం బస్తాలను మిల్లుకు తరలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్: రెడ్డిగూడెంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను జాప్యం చేయడంతో ధాన్యం నిల్వలు భారీగా పేరుకపోయాయి. దీంతో పేరుకపోయిన ధాన్యం అనే శీర్షికతో గురువారం సాక్షి దినపత్రికలో వార్తా కథనం ప్రచురితం అయింది. దీనికి స్పందించిన సొసైటీ, వ్యవసాయ శాఖ అధికారులు గురువారం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు. కొనుగోలు కేంద్రంలో 100 క్వింటాళ్ల ధాన్యాన్ని కాంటా పెట్టి మిల్లుకు తరలించినట్లు సొసైటీ కార్యదర్శి శ్రీను తెలిపారు.

సాల్మన్‌రాజ్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి



మాట్లాడుతున్న జాన్‌విల్సన్

పాల్వంచ: తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్, పాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గోనె సాల్మన్ రాజ్‌కు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని జిల్లా అధ్యక్షుడు జాన్‌విల్సన్ అన్నారు. గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. దళితులకు సీఎం కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలపై హర్షం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో సదానందం, జేమ్స్, యేసుదాస్, రవి, నాతాను, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

అశాస్త్రీయంగా ‘సింగరేణి’లో రిక్రూట్‌మెంట్



మాట్లాడుతున్న మాధవనాయక్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణిలో వెల్ఫేర్ ఆఫీసర్ నియామకంలో అంతర్గత అభ్యర్థులకు, బాహ్య అభ్యర్థులకు విద్యార్హత విషయం అశాస్త్రీయంగా ఉందని ఏబీకేఎంఎస్ కార్యదర్శి మాధవ నాయక్ విమర్శించారు. బీఎంఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ (బీఎంఎస్) సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతర్గత అభ్యర్థులకు నోటిఫికేషన్ జారీ చేసి ఈనెల 21న పరీక్ష నిర్వహణకు హాల్‌టికెట్లు జారీ చేశారని తెలిపారు. అయితే ఎంబీఏ (హెచ్‌ఆర్‌ఎం) పట్టా ఉన్న అభ్యర్థులకు హాల్ టికెట్లు నిరాకరించారని తెలిపారు. డైరెక్టర్ పాకు మార్చి 23న, ఈనెల 5న సీఎండీకి పొరపాటును సవరించి అంతర్గత అభ్యర్థులకు అవకాశం కల్పించాలని వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. హాల్ టికెట్లు మంజూరు చేయాలని, సమస్య పరిష్కరించకపోతే బీఎంఎస్ ఆధ్వర్యంలో న్యాయ పోరాటానికి సైతం వెనకాడమని హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌సీఏకేఎంఎస్ ప్రధాన కార్యదర్శి ఈఎస్ పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

వీఓఏలపై ప్రభుత్వం వివక్ష వీడాలి

టేకులపల్లి: సమస్యలు పరిష్కరించాలని 25 రోజులుగా వీఓఏలు ధర్నా నిర్వహిస్తుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని కాంగ్రెస్ పార్టీ ఇల్లెందు నియోజకవర్గ నేత చీమల వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు గురువారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు వీఓఏల సమ్మె శిబిరానికి వెళ్లి సంఘీభావం తెలిపి సమ్మెలో కూర్చున్నారు. మాట్లాడుతూ.. ఐకేపీ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఆర్థిక స్థితిగతులను మార్చే వీఓఏలను ప్రభుత్వం అర్ధాకలితో ఉంచుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఐడీ కార్డులు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని, ఎస్‌హెచ్‌జీ సభ్యులకు వడ్డీ లేని రుణాలు, అభయహస్తం డబ్బులు చెల్లించాలని డిమాండ్లతో సమ్మె చేస్తున్న వీఓఏల పట్ల ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. వీఓఏలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో భూక్యా దేవానాయక్, పులి సైదులు, జాఫర్, ఎట్టి సమ్మయ్య, రాసమల్ల నర్సయ్య, భూక్యా చంద్రకళ, రవి, రమేష్, వీఓఏలు దాసరి చంద్రకళ, గౌసియా, జయ, శిరోమణి, మంగీలాల్, రాజు, విజయ, కోటేశ్వరి, స్వప్న, సులోచన, సునీత, నాగమణి, ప్రమీల, రోజా, సంధ్య, రాజేశ్వరి, శిరీషా, స్వరూప, శాంతి, రత్నకుమారి పాల్గొన్నారు.



సమ్మెలో ఉత్తరాలు రాసి చూపుతున్న వీఓఏలు

ఎమ్మెల్యేకు వినతిపత్రం

జూలూరుపాడు: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్‌ను వీఓఏలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వీఓఏల సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్యా సోనీ, ఎదళ్లపల్లి వీరభద్రం, పొన్నెకంటి సతీష్ కుమార్, మోదుగు రామకృష్ణ, ఎస్కే మైబూ, కడియాల ఉమ, బాలకోటేశ్వరి, నున్నా లక్ష్మి, శ్యామల, మీనా కుమారి, జ్యోతి, రామకృష్ణ, దుర్గారావు, సీతయ్య, అశోక్ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: జేపీఎస్, వీఓఏల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి డిమాండ్ చేశారు. మండలంలోని రొంపేడు, మిట్టపల్లి గ్రామపంచాయతీలలో మల్టీపర్పస్ వర్కర్లతో కలిసి గురువారం నిరసన వ్యక్తం చేశారు. మాట్లాడుతూ.. జేపీఎస్, వీఓఏలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూర్ణపాక నాగేశ్వరరావు, పొదెం మల్లేశ్వరి, తిరుపతి, శ్రీధర్, మోతీలాల్, రమేష్, భూలక్ష్మి, ప్రతాప్‌కుమార్, వీరస్వామి, సాయి, మంజి, కరుణ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి పోస్టు కార్డులు పంపించాలి

పాల్వంచరూరల్: ఐకేపీ వీఓఏలు 25రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ప్రభుత్వానికి ఉత్తరాలు రాసి పంపాలని, సమ్మెను విరమింపజేయాలని లేనిపక్షంలో సమ్మెను ఉధ్రతం చేస్తామని సీఐటీయూ పట్టణ కన్వీనర్ కె.సత్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఓఏ చేపట్టిన దీక్షా శిబిరం వద్ద గురువారం ఆమె పాల్గొన్నారు. మాట్లాడుతూ.. వీఓఏల న్యాయమైన సమస్యలను పరిష్కారం చేయకుండా సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఏపీఎం, సీసీల ద్వారా వీఓఏలపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో అనురాధ, ఎన్.రమేష్, రమాదేవి, ఉమ, రోజా పాల్గొన్నారు.

వాహనాలపై స్పెషల్ డ్రైవ్

కొత్తగూడెంటౌన్: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడపరాదని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. గురువారం కొత్తగూడెం సబ్ డివిజన్ పరిధిలోని వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ పరిధిలోని సెంటర్లలో వాహన తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు నంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టామని తెలిపారు. ఆటో డ్రైవర్లు తమ ఆటోలకు వెనకాల ఫోన్ నంబర్ కనిపించేలా స్టిక్కర్లు అంటించాలని కోరారు. చాలా ఆటోలు నంబర్ ప్లేట్‌లు లేకుండా తిరుగుతున్నాయని, అలాంటి వారిని మొత్తం 541 ఆటోలను తనిఖీ చేసి వారికి రెండు రోజులు సమయం ఇవ్వడం జరిగిందన్నారు. అదే విధంగా 53 ద్విచక్ర వాహనాలకు నంబర్ ప్లేట్‌లు లేవని గుర్తించి వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. వాహనదారులకు ట్రాఫిక్ నియమాల కోసం తెలిసి ఉండాలని సూచించారు. అదేవిధంగా పట్టణంలోని ప్రతిషాపు యజమాని తమ షాపులలో సీసీ కెమెరాలను తప్పక ఏర్పాటు చేసుకోవాలని ఏదైనా నేరాలు జరిగినప్పుడు నేరస్తులను పట్టుకోవడంతో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా ఉంటుందని చెప్పారు. ఈ మేరకు బస్టాండ్ సెంటర్‌లోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లతో పాటు చుట్టు పక్కల ఉన్న షాపుల యజమానులకు సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్, టూటౌన్ సీఐ ఎల్.రాజు, త్రీటౌన్ సీఐ అబ్బయ్య, ట్రాఫిక్ ఎస్సై రాజేందర్, ఆర్టీసీ డీఎం పాల్గొన్నారు.



సీఐ కరుణాకర్‌కు సూచనలు చేస్తున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

‘దోస్త్’ అడ్మిషన్లకు ఆహ్వానం

పాల్వంచరూరల్: 2023–2024 విద్యా సంవత్సరానికి డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై.చిన్నప్పయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. పాల్వంచ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులలో అడ్మిషన్లకు అవకాశం ఉందని తెలిపారు. మొదటి ఫేస్ ఈనెల 16 నుంచి జూన్ 10వ తేదీ వరకు, ఈ నెల 20వ తేదీ నుంచి జూన్ 11 వరకు వెబ్ ఆప్షన్స్, జూన్ 16 నుంచి మొదటి విడత సీట్ల కేటాయింపు జరుగుతుందని పేర్కొన్నారు. సెకండ్ ఫేస్ రిజిస్ట్రేషన్ జూన్ 16 నుంచి 26వ తేదీ వరకు, 16 నుంచి 27 వరకు వెబ్‌ఆప్షన్లు, 30వ తేదీన రెండో విడత సీట్ల కేటాయింపు, మూడో ఫేస్ రిజిస్ట్రేషన్ జూలై1 నుంచి 5వ తేది వరకు, జూలై1 నుంచి 6వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు, 10వ తేదీన మూడో విడత సీట్ల కేటాయింపు, జూలై 17వ తేదీ నుంచి ఫస్ట్ సెమిస్టర్ తరగతులు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9908222961, 9441908635, 9550836631 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎస్‌ఎఫ్‌ఐ సమావేశాలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వీరభద్రం

జూలూరుపాడు: జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని టీచర్స్ భవన్‌లో ఈనెల 19, 20, 21వ తేదీల్లో జరగనున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం పిలుపునిచ్చారు. గురువారం జూలూరుపాడులోని సీపీఎం కార్యాలయంలో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజులు జరగనున్న సమావేశాల్లో విద్యారంగ సమస్యలపై చర్చించడంతోపాటు, తీర్మానాలు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా విద్యారంగ సమస్యలపై భవిష్యత్ పోరాటాల రూపకల్పన చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశాలను విజయవంతం చేసేందుకు విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్ కుమార్, కొత్తగూడెం డివిజన్ అధ్యక్షుడు బోడా అభిమిత్ర, గగన్, వికాస్, ప్రభు, కల్యాణ్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్‌కుమార్‌ను కలిసిన బీఎస్పీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: బీఎస్పీ చీఫ్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను హైదరాబాద్‌లో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ గురువారం కలిసి సన్మానించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు జరగబోతున్నాయని, ఈ నెల 7వ తేదీన హైదరాబాద్ లోని సరూర్‌నగర్‌లో జరిగిన బహిరంగ సభలో పార్టీ జాతీయ అధ్యక్షురాలు బెహన్ మాయావతి ప్రవీణ్‌కుమార్ ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడంతో బీఎస్పీ పార్టీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధమైందనే విషయాన్ని తేల్చి చెప్పిందని పేర్కొన్నారు. ఇక తాడో పేడో తేల్చుకోవడమే మిగిలిందని, తెలంగాణ భరోసా మహాసభతో రాష్ట్రంలో అన్ని పార్టీల కంటే ముందుగా ఎన్నికల శంఖారావాన్ని పూరించడమే కాకుండా ముఖ్యమంత్రి అభ్యర్థిని కూడా ముందుగా ప్రకటించిన ఘనత బీఎస్పీకి దక్కుతుందని తెలిపారు. ప్రవీణ్‌కుమార్‌ను కలిసిన వారిలో జిల్లా ఇన్‌చార్జ్ నల్లగట్ల రఘు, ధనుంజయ్, కనగల ధనుష్ తదితరులు ఉన్నారు.



ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

పంట నష్టపరిహారం చెల్లించాలి




తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

టేకులపల్లి: అకాల వర్షంతో పాడైన పంటలకు, ప్రతి ఎకరానికి రూ.25వేల నష్టపరిహారం వెంటనే చెల్లించాలని, గిట్టుబాటు ధరతో తడిసిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా నేత భూక్యా హర్యా నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సంఘం ఆధ్వర్యంలో టేకులపల్లి తహసీల్దార్ వీరభద్రానికి వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన అకాల వర్షం, వడగళ్లతో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు, మామిడి, జామ, ఇతర పండ్లు, కూరగాయల తోటలకు తీవ్రంగా నష్టం జరిగిందని, ధాన్యం, మిర్చి తడిసిపోయిందని వాపోయారు. సీఎం, మంత్రులు ప్రతి గింజ కొంటామని ప్రచారం చేసుకుంటున్నారని, ఆచరణలో మాత్రం ఎక్కడా కనిపించడం లేదని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు అవుతున్నా నేటికీ పోడు భూములకు పట్టాలు ఇవ్వలేదన్నారు. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో భూక్యా నర్సింగ్, ధరావత్ వెంకటేశ్వర్లు, భూక్యా జంబూ, రాంకోటి, బాలాజీ, నోముల భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేలంపాట

కొత్తగూడెంటౌన్: శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేష్‌టెంపుల్)కు చెందిన నాలుగు షాపులకు శుక్రవారం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు గురువారం ఆలయ ఈఓ సులోచన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయానికి చెందిన 5 షాపులు కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్మకాల కోసం బహిరంగ వేలంపాటను ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఆసక్తి కలిగిన వారు తగు డిపాజిట్ చెల్లించి, పాటలో పాల్గొనాలని తెలిపారు. వివరాలకు దేవస్థానంలోని టికెట్ కౌంటర్‌లో సంప్రదించాలని సూచించారు.



అటెన్షన్ ప్లీజ్

మురుగు తొలగించండి..

ఇల్లెందు మండలం సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ కూడలిలో ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు కాల్వలను నిర్మించారు. కానీ కాల్వ నిర్వహణను గ్రామపంచాయతీ విస్మరించింది. దీంతో చెత్తచెదారంతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. వ్యాపారులు కాలవ్వను ఆక్రమించేశారు. శుభ్రం చేసే పరిస్థితి కూడా లేదు. దీంతో మురుగు ప్రవహించే మార్గం లేకుండా పోయింది. అధికారులు స్పందించి కాల్వను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు. - ఇల్లెందురూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : రజినీకాంత్, పంచాయతీ కార్యదర్శి, సుభాష్‌నగర్
సెల్ నెంబర్: 9966142448